సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 2 । మార్చి । 2023



రుణాలు, ఉద్యోగాల పేరుతో బురిడీ

ప్రజాప్రతినిధుల వల్లే ఉద్యోగం పోయిందనే అక్కసుతో ఓ మాజీ ఏఈ వాళ్లనే టార్గెట్ చేసి మోసాలకు పాల్పడ్డాడు. ఆంధ్ర, తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేయడంతో జైలు జీవితం గడుపుతున్నాడు. తాజాగా నెల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,820
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,164
3 శాతం జీఎస్టీతో	రూ.5,319
నవర (8 గ్రా)	రూ.42,552

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.4 /24.5

జిల్లా వ్యాప్తంగా పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు రెండు రోజుల్లో రెండు సెంటీగ్రేడ్లు పెరిగాయి. గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ 63 శాతం ఉంది.

న్యూస్‌రీల్

87.09 శాతం పింఛన్ల పంపిణీ



నడవలేని స్థితిలో ఉన్న కొండాయపాలెం ప్రాంతానికి చెందిన జి.లక్ష్మిదేవికి నగదు అందజేస్తున్న వలంటీర్ ఎం.హరిత

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా వేగవంతంగా జరుగుతోంది. బుధవారం తొలిరోజు 87.09 శాతం మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. 3,08,953 మందికి నగదు పంపిణీ చేయాల్సి ఉండగా 2,69,065 మందికి అందజేశారు. వలంటీర్లు తెల్లవారుజాము నుంచే కానుక పంపిణీని ప్రారంభించారు. జిల్లాలో పింఛన్ల పంపిణీలో రాపూరు, వెంకటాచలం, అల్లూరు మండలాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ కానుక పంపిణీ జరగనుంది.

ఈ నెల 6వ తేదీలోపు ఫీజు చెల్లించాలి

నెల్లూరు (టౌన్): లైబ్రరీ సైన్స్, ఇన్ఫర్మేషన్ సైన్స్ విద్యార్థులు ఈ నెల 6వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ గంగాభవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.60 అపరాధ రుసుంతో ఈ నెల 9వ తేదీ వరకు గడువు ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.150, ఫెయిల్ అయిన విద్యార్థులు 3 పేపర్లకు రూ.100, మూడు పేపర్లు పైన ఉంటే రూ.150 చెల్లించాలని చెప్పారు. ఈ నెలలోనే పరీక్షలు జరుగుతాయన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 138 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు బుధవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 138 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన జనరల్‌కు సంబంధించి 3,074 మందికి 3,014 మంది హాజరయ్యారు. 60 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 255 మందికి 217 మంది హాజరు కాగా, 38 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,609 మందికి 2,569 మంది హాజరు కాగా 40 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 11 మందికి 11 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా అబ్జర్వర్ నుంచి హైపవర్ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 37 కేంద్రాలను తనిఖీ చేశారు.

డూప్లికేటుగాళ్లు

కావలి కేంద్రంగా కేటుగాళ్లు చెలరేగిపోతున్నారు. ఏకంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికార వ్యవస్థ సంతకాల ఫోర్జరీలతో ఒరిజనల్‌ను తలపించే రీతిలో నకిలీ పట్టాలు, వన్–బీ, పట్టాదారు పాస్‌పుస్తకాలు, శిస్తు రసీదులు సృష్టిస్తున్నారు. అమాయకులను మోసగించి రూ.లక్షలు దోచుకుంటున్నారు. తాజాగా ఓ ప్రభుత్వ సంస్థ భూమికి సంబంధించి రెవెన్యూ, తహసీల్దార్ ముద్రలతో పాటు కింది స్థాయి అధికారి సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి డీ ఫారం పట్టాను రూపొందించారు. ఆ పట్టా ఆధారంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు, శిస్తు రసీదులు, సాగుబడి అడంగళ్‌ను తయారు చేశారు.

- ప్రభుత్వ సంస్థ భూమికి నకిలీ పట్టా సృష్టి
- పక్కాగా వన్–బీ, పట్టాదారు పాస్‌పుస్తకాల రూపకల్పన
- ఏళ్లతరబడి శిస్తులు చెల్లించినట్లు రసీదులు
- వీఆర్వో, తహసీల్దార్, ఆర్డీఓ, సబ్ రిజిస్ట్రార్ సంతకాలు ఫోర్జరీ
- ఆన్‌లైన్ చేయడానికి రూ.14 లక్షల కాజేశారు

కావలి: కావలిలో భూముల ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు కొందరు కుటుంబ వివాదాలు ఉన్నాయని, ఖరీదైన భూమిని తక్కువ ధరకు ఇప్పిస్తామని, ఆ భూమికి సంబంధించి పూర్తి హక్కులు అందిస్తామని అమాయకులను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఓ భూమికి సంబంధించి నకిలీ పట్టాలు, పట్టాదారు పాస్‌పుస్తకం, శిస్తు రసీదులు, సాగుబడి అడంగళ్ వ్యవహారం బయట పడడంతో కేటుగాళ్ల గుట్టు రట్టయింది. ఇదొక్కటేనా.. ఇప్పటి వరకు ఇలాంటివి ఎన్ని జరిగాయో బాధితులు బయటకొస్తే కానీ వెలుగుచూసే అవకాశం లేదు. ఆ బాధితుడి ఫిర్యాదులో అప్రమత్తమైన రెవెన్యూ, పోలీసులు రంగంలోకి దిగారు. కేటుగాళ్ల కోసం గాలిస్తున్నారు.



నకిలీ వన్–బీ, పట్టాదారు పాస్ పుస్తకాలు

ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా నమ్మించి..

కావలి మండలం రుద్రకోట పరిధిలో సర్వే నంబరు 515/1లో ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు కేటాయించారు. చెన్నై– కోల్‌కతా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ ఖాళీ భూమిని చూపించి, విలువైన ఈ భూమి కారుచౌకగా అమ్మకానికి సిద్ధంగా ఉందని కేటుగాళ్లు ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి రూ.14 లక్షలు కాజేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. కావలి మండలం తుమ్మలపెంట పంచాయతీ రామాంజనేయపురం గ్రామానికి చెందిన వాయిల రమణయ్య తుమ్మలపెంట కూడలిలో టీ స్టాల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వాయిల రమణయ్యకు తుమ్మలపెంట గ్రామానికి పక్కనే ఉన్న రెడ్డిపాళెంకు చెందిన కొండారెడ్డి సుపరిచితుడు. ఈ పరిచయాన్ని అడ్డం పెట్టుకుని కొండారెడ్డి రుద్రకోటలో జాతీయ రహదారికి పక్కనే రూ.కోట్ల విలువైన 2.30 ఎకరాల భూమి ఉందని, తక్కువ ధరకు ఇప్పిస్తానని వాయిల రమణయ్యను నమ్మించాడు. అయితే ఈ భూమి కొనుగోలు వ్యవహారం అత్యంత రహస్యంగా చేసుకోవాలని చెప్పాడు. భూమి యజమాని వృద్ధురాలని, ఆమె కోడలుకు తెలిస్తే వ్యవహారం చెడిపోతోందని నమ్మబలికాడు. వాయిల రమణయ్యను తీసుకుని కావలి పట్టణంలో ఉంటున్న ఓ వృద్ధురాలి వద్దకు తీసుకెళ్లాడు. ఆమె కూడా కొండారెడ్డి చెప్పినట్లే చెప్పడంతో అంతా నమ్మకం కుదిరింది. పక్కాగా రికార్డులు మార్పిడి చేయించే బాధ్యత కూడా తనదే అని నమ్మించడంతో కోట్ల రూపాయలు విలువ చేసే భూమికి యజమానిని అవుతున్నాననే ఆశలు రమణయ్యకు కలిగింది.



భూమి విలువ ధ్రువీకరిస్తూ సబ్ రిజిస్ట్రార్ సంతకం, రబ్బర్ స్టాంప్ సీల్



1986 ఆగస్టు 14న జారీ చేసినట్లు నకిలీ పట్టా

నకిలీల వెనుక పెద్ద ముఠానే ఉండొచ్చు..

ఈ కేటుగాళ్లు డీ–ఫారం పట్టా, వన్–బీ, పట్టాదారు పాస్‌పుస్తకం, శిస్తు రసీదులు, సాగుబడి హక్కు పత్రాలు అన్నీ పక్కాగా రెవెన్యూ అధికారులు సంతకాలు, సీల్స్‌తో తయారు చేయడం చూస్తే కొండారెడ్డి వెనుక పెద్ద ముఠానే ఉండొచ్చనే అనుమానాలు వస్తున్నాయి. ఇప్పటికి ఇలాంటి ఎన్ని నకిలీ పత్రాలు సృష్టించి, ఎంత మందిని మోసం చేశారో పోలీసులు కూపీలాగితే బయటపడే అవకాశాలు ఉన్నాయి. వాయిల రమణయ్యకు భూమిని ఆన్‌లైన్ చేయిస్తానని కొండారెడ్డి ఒక వీఆర్వోను పరిచయం చేశాడు. అతడు నిజంగా వీఆర్వోనేనా.. లేక అతను నకిలీనా అనేది కూడా తేలాల్సి ఉంది.

భూముల కొనుగోలులో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



నకిలీ పట్టాలతో ఇంటి స్థలాలు, భూములు అమ్మకాలు చేస్తున్న ఘటనలు తరచుగా వెలుగులోకి వస్తున్నాయి. ఇంటి స్థలం కాని, భూముల వివరాలు కూడా ఆన్‌లైన్‌లో ఉంటున్నాయి. తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ఆ భూములకు సంబంధించిన వివరాలు తెలుసుకోవాలి. భూముల క్రయవిక్రయాల్లో రహస్యం అనేది ఉండదు. పారదర్శకంగా ఉండాలి. తక్కువ ధరకు వస్తుందంటే అది మోసంగానే గ్రహించాలి. తాజాగా వెలుగులోకి వచ్చిన నకిలీ భూమి అమ్మకం, కొనుగోలు వ్యవహారాన్ని పోలీసులు విచారిస్తున్నారు. వారికి అవసరమైన సమాచారాన్ని అందించాం.


– కె.మాధవరెడ్డి, తహసీల్దార్, కావలి

నకిలీ రెవెన్యూ రికార్డులు సృష్టి



భూమికి నకిలీ నీటి తీరువా శిస్తులు

2.30 ఎకరాల భూమికి సంబంధించి పక్కాగా భూమి హక్కు పత్రాలు సిద్ధం చేయడానికి అంటూ కొండారెడ్డి విడతల వారీగా వాయిల రమణయ్య దగ్గర రూ.12 లక్షలు వసూలు చేశాడు. వాయిల రమణయ్య పేరుతో 1986 ఆగస్టు 14వ తేదీతో తహసీల్దార్ జారీ చేసినట్లు డీ–ఫారం నకిలీ పట్టా కాగితం, వీటిల్లో వీఆర్వో నుంచి ఆర్‌ఐ, తహసీల్దార్, ఆర్డీఓ సంతకాలు, రెవెన్యూ రబ్బర్ స్టాంప్ సీళ్లు వేసి అచ్చం ఒరిజినల్‌ను తలపించే విధంగా పట్టా నంబరు 144 పేరుతో భూమి యాజమాన్య హక్కు పత్రం (వన్–బీ), పట్టాదారు పాస్‌పుస్తకాలు, 1370 ఫసలీ నుంచి శిస్తు చెల్లిస్తున్నట్లు నకిలీవి తయారు చేసి రమణయ్యకు ఇచ్చాడు. తనకు అడంగళ్ కావాలని కోరితే ఆన్‌లైన్ కాలేదని, మాన్యువల్ సాగుబడి పత్రాన్ని తెచ్చి ఇచ్చాడు. ఇది కూడా నకిలీదే. ఆఖరికి పట్టాదార్‌పాస్ పుస్తకంలో భూమి విలువను నిర్ధారిస్తూ సబ్ రిజిస్ట్రార్ సంతకం, రబ్బర్ స్టాంప్‌ను కూడా వేశారు. తన భూమిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, మీ సేవ నుంచి నకలు వచ్చేలా చేయాలని రమణయ్య కోరాడు. దీంతో కొండారెడ్డి ఓ వీఆర్వోను రంగంలోకి తీసుకువచ్చి, అతని ద్వారా ఆ పని పూర్తి చేస్తామని చెప్పి.. అందుకు మరో రూ.2 లక్షలు వసూలు చేశాడు. మొత్తంగా రూ.14 లక్షలు పిండేశాడు. ఎన్ని రోజులైనా ఈ పనికాకపోవడంతో, కొండారెడ్డి నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో అనుమానం వచ్చింది. వెంటనే కావలి రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. తాను మోసపోయిన తీరును క్షుణ్ణంగా వివరించాడు. పోలీసులు కూడా స్థానిక తహసీల్దార్‌ను స్పందించి రికార్డులు పరిశీలించడంతో అన్నీ నకిలీవని నిర్ధారించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



నకిలీ మాన్యువల్ అడంగళ్



అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

నెల్లూరు (క్రైమ్): ప్రతి పౌర్ణమికి అరుణాచలం గిరిప్రదక్షిణకు నెల్లూరు–2 డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆ డిపో మేనేజర్ శివకేష్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న ఉదయం 10 గంటలకు నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. గిరిప్రదక్షిణ అనంతరం 7వ తేదీ రాత్రి బయలుదేరి 8వ తేదీ ఉదయానికి నెల్లూరుకు చేరుకుంటుందని చెప్పారు. బస్సు చార్జీ రూ.1,200 నిర్ణయించామని ఆసక్తి ఉన్న ప్రయాణికులు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి




విద్యార్థిని భావనను అభినందిస్తున్న డీఈఓ గంగాభవాని తదితరులు

- ఏకో ఫ్రెండ్లీ ఫార్మర్ స్టిక్ ప్రాజెక్ట్‌ను రూపొందించిన బిట్రగుంట విద్యార్థిని
- రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం

నెల్లూరు (టౌన్): విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని డీఈఓ గంగాభవాని తెలిపారు. బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏకో ఫ్రెండ్లీ మెటీరియల్ విభాగంలో ఏకో ఫ్రెండ్లీ ఫార్మర్ స్టిక్ ప్రాజెక్ట్ రూపొందించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన బిట్రగుంట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని వై.భావనను డీఈఓ గంగాభవాని అభినందించారు. జిల్లా నుంచి ఎక్కువ మంది శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, గైడ్ టీచరు విజయలక్ష్మి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, స్కూల్ హెడ్‌మాస్టర్ చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిగ్గు తేల్చినా.. చర్యలేవి?



జిల్లా రిజిస్ట్రేషన్‌శాఖ అవినీతిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా పరిధిలోని పలువురు సబ్ రిజిస్ట్రార్లు నిషేధిత జాబితాలోని సర్వే నంబర్లకు రిజిస్ట్రేషన్లు చేయడం నుంచి స్టాంప్ డ్యూటీ తగ్గించే విధంగా అడ్డదార్లు తొక్కారు. ప్రభుత్వ భూములకు, ఎనీవేర్ విధానం ద్వారా ప్రైవేట్ భూములకు రిజిస్ట్రేషన్లు చేశారు. దొంగలు.. దొంగలూ కలిసి ఊర్లు పంచుకున్న చందంగా ఇలాంటి అక్రమాలపై విచారణ చేపట్టాల్సిన రిజిస్ట్రేషన్‌శాఖ ఇంటర్నల్ ఆడిట్ అధికారులు సైతం అవినీతిని కప్పిపుచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖ అవినీతిపై రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో రంగంలోకి దిగిన ఏసీబీ సబ్‌రిజిస్ట్రార్ల అవినీతిపై నిగ్గు తేల్చి నివేదిక ఇచ్చి ఏడాది అయినా ఏ స్థాయిలోనూ చర్యలు తీసుకున్న దాఖలు కనిపించడం లేదు.

రిజిస్ట్రేషన్‌శాఖ అవినీతిపై ఏసీబీ నివేదిక ఇచ్చి ఏడాది

- ఇంటర్నల్ ఆడిటింగ్ విభాగంలో తనిఖీలు
- నిషేధిత జాబితా సర్వే నంబర్లకు 77 డాక్యుమెంట్ల ద్వారా రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వ ఖజానాకు చిల్లు పెట్టేలా వ్యవహరించిన అధికారులు
- ఇంటర్నల్ ఆడిట్ అధికారుల అవినీతిపై నివేదిక ఇచ్చిన ఆడిట్ రిజిస్ట్రార్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలోని పలువురు సబ్ రిజిస్ట్రార్ల నుంచి ఇంటర్నల్ ఆడిట్ అధికారుల అవినీతిని నిగ్గు తేల్చినా.. నివేదికలను తొక్కి పెట్టి వారిని కాపాడుతున్నారు. ఏసీబీతో పాటు ఆడిట్ విభాగం రిజిస్ట్రార్ ఏడాది క్రితం ఇచ్చిన నివేదికలు ఉన్నతస్థాయిలో బుట్టదాఖలు అవుతున్నాయా? కింది స్థాయిలో మసిపూడి మారేడు కాయ చేస్తున్నారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్లు చేయడం నుంచి ప్రైవేట్ భూములకు స్టాంప్ డ్యూటీలు తగ్గించే విధంగా ఏకంగా భూముల స్వరూపాన్ని మార్చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి పడేలా వ్యవహరించినట్లు ఇంటర్నల్ ఆడిటింగ్ విభాగంలో భారీగానే అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఏసీబీ, ఇంటర్నల్ ఆడిట్ రిజిస్ట్రార్ నిర్ధారించారు. అప్పట్లో బుజబుజనెల్లూరు, నెల్లూరు ఆర్‌ఓ కార్యాలయంలో ప్రభుత్వ భూములకు అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు నిర్ధారించారు. టీడీపీ హయాంలో బుజబుజనెల్లూరు రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయ పరిధిలోని కల్లూరుపల్లి ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో అక్రమ లేఅవుట్‌లు వేసి ఆ పార్టీ నేతలు విక్రయాలు చేసుకున్నారు. నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నంబర్లలో ఉన్న భూములు, ప్లాట్లకు సంబంధించి 75 డాక్యుమెంట్ల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసినట్లు ధ్రువీకరించారు. 2018లో ప్రభుత్వ భూములను గుర్తించిన కలెక్టర్ ఆ సర్వే నంబర్లను ఆర్‌సీఈ 11/610 /201 తేదీ 31మే 2018న నిషేధిత జాబితా (22ఏ)లో ఉంచి రిజిస్ట్రేషన్లు చేయొద్దని ఆదేశాలు ఇచ్చారు. కానీ సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ 2020 ఏడాదిలో నిషేధిత జాబితాలో ఉన్న ఆ సర్వే నంబరులోని ప్లాట్లకు 1786/2020, 1768/2020, 1700/2020, 1683/2020, 1674/ 2020, 1639/2020 నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసినటు తెలుస్తోంది. నెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నంబర్లలో ఉన్న ప్లాట్లకు కూడా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలిసింది. ఆయా డాక్యుమెంట్లు పరిశీలిస్తే 10854/2019, 10864/2019, 4119/2020, 417/2021, 418/2021 డాక్యుమెంట్ల ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లు నిషేధిత జాబితాలో ఉన్నట్లు తేల్చారు.

నివేదికపై పురోగతి లేదు

జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అవినీతి తంతు, ఉన్నతాధికారి వ్యవహార తీరుపై రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లడంతో అప్పటి కమిషనర్ శేషగిరిబాబు స్పందించి తన కార్యాలయం నుంచి జాయింట్ ఐజీ రవికుమార్‌ను విచారించి వాస్తవ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సదరు అధికారి నెల్లూరు కార్యాలయానికి చేరుకుని విచారణ జరిపారు. ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్ల వ్యవహారం విచారణలో నివేదిక తారుమారు చేయడంపై జిల్లా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి వాస్తవ నివేదికను ఐజీకి అందించారు. నిషేధిత జాబితాలోని భూములకు చేసిన రిజిస్ట్రేషన్లు రద్దు చేసిన పాపాన పోలేదు. ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని రెవెన్యూ అధికారులు ఇచ్చే నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నంబర్ల భూములను రిజిస్ట్రేషన్లు జరిపి దండిగా సంపాదించుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీ స్థాయిలో గండి పెట్టి తమ సొంత ఆస్తులు పెంచుకోవడంపైనే కొందరు అధికారులు దృష్టి పెట్టారు.

ఏడాది క్రితమే నివేదిక ఇచ్చాం

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ అక్రమాలపై ఉన్నతాధికారులు ఆదేశాలతో తనిఖీలు చేసి అక్రమాలను నిగ్గు తేల్చాం. ఇంటర్నల్ ఆడిట్‌లో ఎన్నో లోపాలను గుర్తించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాం. నిషేధిత జాబితాలో ఉన్న భూములు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించాం. స్టాంప్ డ్యూటీ చెల్లింపుల్లో తేడాలు గుర్తించాం. ఇంకా స్కాన్ చేయని డాక్యుమెంట్స్ కూడా గుర్తించి అన్నింటిపై పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేసి పంపాం.

– మోహన్, డీఎస్పీ, ఏసీబీ

కమిషనర్‌కు నివేదికలు వెళ్తాయి

జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్లు అవినీతి, అక్రమాలపై ఏసీబీ, రిజిస్ట్రేషన్‌శాఖ ఇంటర్నల్ ఆడిట్ రిజిస్ట్రార్ ఇచ్చిన నివేదికలు మా వద్దకు రాలేదు. కమిషనర్‌కు వెళ్తాయి. వారి నుంచి వచ్చే ఆదేశాల మేరకే చర్యలు తీసుకుంటాం. నేను కొత్తగా ఈ మధ్యనే జాయిన్ అయ్యాను. నా వద్దకు వచ్చే ఫిర్యాదులపై చర్యలు చేపడుతున్నాను. ఇటీవల వెలుగుచూసిన అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయడంతోపాటు సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశాం.

– కిరణ్‌కుమార్, డీఐజీ, స్టాంప్స్ అండ్, రిజిస్ట్రేషన్‌శాఖ

ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుల తొలగింపు

నెల్లూరు (అర్బన్): ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలో సభ్యులుగా ఉన్న కొప్పోలు రఘు, కేసీ పెంచలయ్యలను తొలగిస్తూ కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారిపై పలు రకాల విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో విచారించిన ఎస్పీ విజయారావు ఇచ్చిన నివేదిక ఆధారంగా వారిని తొలగించారు. విడవలూరుకు చెందిన చౌటూరి శ్రీనివాసులును విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలోకి కొత్తగా సభ్యుడిగా తీసుకున్నారు.

సోమశిలలో 61.168 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 61.168 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 116 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 2000, ఉత్తరకాలువకు 700, దక్షిణకాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సగటున 331 క్యూసెక్కులు ఆవిరవుతోంది.

రౌడీషీటర్లపై నిఘా

'మీరంతా నేర ప్రవృత్తి వీడాలి. మంచిగా జీవించాలి. తీరు మార్చుకోకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.' రౌడీషీటర్లకు పోలీస్ అధికారులు చేస్తున్న హెచ్చరికలివి. ఇటీవల నెల్లూరులో కొన్ని ఘటనలు జరిగిన నేపథ్యంలో పోలీస్ శాఖ మరింత అప్రమత్తమైంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపుతోంది. నెలరోజుల వ్యవధిలోనే పదుల సంఖ్యలో రౌడీషీట్లు తెరిచారు.

- కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారులు
- తీరు మారకపోతే కఠిన చర్యలుంటాయని హెచ్చరికలు
- నెలరోజుల వ్యవధిలో 18 మందిపై రౌడీషీట్
- ఇప్పటికే పదిమందిపై పీడీ యాక్టులు



చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారులు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో నేరాలను పూర్తిస్థాయిలో కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు పోలీస్ శాఖ పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఎస్పీ ఆదేశాలతో రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచడంతోపాటు నేరాలకు పాల్పడుతున్న వారిపై రౌడీషీట్లు తెరుస్తున్నారు. అయినా తీరు మార్చుకోని వారిపై పీడీ యాక్టులు ప్రయోగిస్తున్నారు. తాజాగా మరికొందరిపై యాక్ట్ ప్రయోగానికి చర్యలు చేపట్టారు. రౌడీషీటర్లు, పాతనేరస్తులు, ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వారికి తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. నేరస్తులు ఎంతటివారైనా ఉపేక్షించవద్దని కఠినంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు.

యాక్టివ్ రౌడీషీటర్లపై ఆరా..

శాంతిభద్రతలకు, ప్రజా జీవనానికి భంగం కలిగించే యాక్టివ్ రౌడీషీటర్లు, పాతనేరస్తుల జాబితాను పోలీస్ శాఖ సిద్ధం చేసింది. వారి కదలికలపై నిఘా పెంచారు. స్టేషన్ల వారీగా వారికి డీటీసీలో కౌన్సెలింగ్ ఇస్తూ తీరు మార్చుకోవాలని, లేకపోతే పీడీ యాక్టులు ప్రయోగిస్తామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే సుమారు 11 మందికిపైగా నేరస్తులపై పీడీ యాక్ట్ పెట్టారు.

18 మందిపై..

గతంలో పలు కేసుల్లో ఉండి తరచూ నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి రౌడీషీట్లు తెరుస్తున్నారు. నెలరోజుల వ్యవధిలో 18 మందిపై పోలీసు అధికారులు కొత్తగా షీట్లు తెరిచారు. నేరస్తులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కఠినంగా వ్యవహరిస్తామని పోలీస్ అధికారులు తమ చేతల ద్వారా నిరూపిస్తున్నారు.

సబ్ డివిజన్	డీసీ	కేడీ	సస్పెక్టెడ్	రౌడీస్
నెల్లూరు నగరం	46	21	635	317
నెల్లూరు రూరల్	23	5	643	237
కావలి	38	2	574	225
ఆత్మకూరు	21	2	234	95
కందుకూరు	7	3	165	110

ఇటీవల

- గత నెల 24వ తేదీన నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉడ్‌హౌస్‌సంఘంలో ఓ యువకుడిని హత్య చేసిన వారిలో ఒక రౌడీషీటర్, పాత నేరస్తులున్నారు.
- రెండురోజుల క్రితం పొదలకూరు రోడ్డు వద్ద కత్తులతో బెదిరించి దోపిడీకి యత్నించిన ఏడుగురు రౌడీషీటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు.

కఠినంగా వ్యవహరిస్తున్నాం



పదేపదే నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఈ ఏడాది నెలరోజుల వ్యవధిలో 18 మందిపై రౌడీషీట్లు తెరిచాం. రౌడీషీటర్లు, పాత నేరస్తులు నేరప్రవృత్తిని వీడి పనులు చేసుకుంటూ కుటుంబంతో సంతోషంగా గడపాలని పదేపదే సూచిస్తున్నాం. తీరుమారని పదిమందికిపైగా పీడీ యాక్టులు ప్రయోగించాం. మరికొందరిపై చర్యలకు రంగం సిద్ధం చేశాం.

– సీహెచ్ విజయారావు, ఎస్పీ

రౌడీషీట్ ఎందుకు తెరుస్తారంటే?

- ఏదైనా వ్యక్తి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అతను చేసే నేరాల తీవ్రతను బట్టి డీఎస్పీ స్థాయి అధికారి రౌడీషీట్ తెరుస్తారు.
- హత్యలకు పాల్పడటం, కిరాయి హత్యలు చేయడం, దొమ్మీలకు పాల్పడడం, వ్యక్తులను బెదిరించి బలవంతపు వసూళ్లు చేయడం, నిత్యం గొడవలు సృష్టించడం, దాడులు చేయడం.
- మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, వారి వెంటపడి వేధించడం, మహిళలను వ్యభిచార గృహాలకు తరలించడం, బలవంతపు భూ సెటిల్‌మెంట్లు చేయడం, ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించడం, రిగ్గింగ్‌కు పాల్పడటం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయండం వంటి నేరాలకు పాల్పడేవారిపై రౌడీషీట్లు తెరుస్తారు.

ఇవీ నష్టాలు

ఒక వ్యక్తిపై రౌడీషీట్ తెరిస్తే సంఘంలో చిన్నచూపు చూస్తారు. ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు ఉండవు. ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు అటువంటి వారికి ఉద్యోగం ఇచ్చేందుకు ముందుకు రారు. విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్టు పొందే అవకాశం లేదు. బంధువులు, స్నేహితులు వారికి దూరంగా ఉంటారు. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి.

నెల్లూరు నగరంపై ప్రత్యేక దృష్టి

ప్రధానంగా నెల్లూరు నగరంలో అడపాదడపా నేరాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఎస్పీ ఆదేశాలతో నగర పోలీసు అధికారులు రోజూ సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు విజిబుల్ పోలీసింగ్, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై గతంలో ఏమైనా కేసులున్నాయా? అని ఆరా తీస్తున్నారు. అదే క్రమంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు సైతం రోజూ రాత్రి 11 గంటల వరకు విధిగా వాహన తనిఖీలు చేపట్టారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచారు. ఇలా చేయడం ద్వారా ఏదైనా నేరం జరిగిన సమయంలో నిందితులను గుర్తించే అవకాశం ఉందని పోలీసులు పేర్కొంటున్నారు. నైట్ బీట్ల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఒక ఎస్సై, కొందరు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.



డీకేడబ్ల్యూలో బ్యాలెట్ బాక్స్‌ల పరిశీలన

నెల్లూరు(అర్బన్): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాలలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్స్‌లు, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మలోల, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు హనుమాన్ ప్రసాద్, నెల్లూరు రూరల్ తహసీల్దార్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్

పాతకక్షలతోనే యువకుడి హత్య



వివరాలు వెల్లడిస్తున్న నెల్లూరు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

- హత్య కేసులో ఏడుగురి అరెస్ట్
- మరొకరి కోసం గాలింపు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో సంచలనం రేకెత్తించిన ఓ యువకుడి హత్య కేసులో ఏడుగురు నిందితులను నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గత నెల 24వ తేదీన ఉడ్‌హౌస్‌సంఘంలోని మహాలక్ష్మి దేవాలయం వద్ద బి.మహేష్‌బాబు (23) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. దీనిపై మృతుడి అన్న మస్తానయ్య ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా పుటేజీ, స్థానికులు పట్టుకున్న మోటార్‌బైక్ ఆధారంగా నిందితుల్లో ఒకడైన వేదాయపాళెనికి చెందిన పాతనేరస్తుడు ఎ.సుజన్‌కృష్ణ అలియాస్ చింటూగా గుర్తించి ఆ దిశగా విచారణ చేపట్టారు. మృతుడికి సుజన్‌కృష్ణకు పాతగొడవలున్నాయి. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కొద్దిరోజుల క్రితం వారి మధ్య ఘర్షణ జరిగింది. మహేష్‌బాబు చింటూపై దాడి చేశాడు. దీంతో చింటూ కక్ష పెంచుకున్నాడు. మహేష్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్న అతను తన స్నేహితులైన బాలాజీనగర్‌కు చెందిన రౌడీషీటర్ కె.భాను విష్ణువర్ధన్ అలియాస్ లడ్డా, బుజబుజనెల్లూరుకు చెందిన సాయి జగదీష్ అలియాస్ సాయి, బాలాజీనగర్ చీపురకట్ట సంఘానికి చెందిన ఎం.స్రవంత్, హరనాథపురానికి చెందిన షేక్ రెహమాన్, బీవీనగర్‌కు చెందిన ఎ.వెంకటేష్ అలియాస్ జోసెఫ్ అలియాస్ జోజో, చంద్రమౌళినగర్‌కు చెందిన సీహెచ్ రవీంద్రకు విషయాన్ని తెలియజేశాడు. అందరూ కలిసి మహేష్‌బాబును హత మార్చేందుకు రెక్కీ చేశారు. పూటుగా మద్యం తాగి కత్తులు, తల్వార్‌లతో దాడిచేసి హతమార్చారు. బుధవారం నిందితులను ఎన్‌హెచ్–16 ఎఫ్‌సీఐ కాలనీ క్రాస్‌రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం చేసినట్లు అంగీకరించడంతో అరెస్ట్ చేశారు. కేసులో మరో నిందితుడు ఉన్నాడని, అతడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని నగర డీఎస్పీ తెలిపారు. నిందితులందరూ నేర చరిత్ర కలిగిన వారేనని, త్వరలో రౌడీషీట్లు తెరుస్తామన్నారు. సమావేశంలో నవాబుపేట ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, ఎస్సై కె.తిరుపతయ్య, సిబ్బంది ఆర్వీ రత్నం, ఎస్.గోపాలయ్య, ఎస్.సురేంద్రబాబు, మోహన్‌కృష్ణ, మోహన్‌బాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.

5న జిల్లాస్థాయి చెస్ పోటీలు

బుచ్చిరెడ్డిపాళెం: ఈనెల 5వ తేదీన జిల్లాస్థాయి ఓపెన్ అండర్–15, అండర్–19, మహిళకు చెస్ పోటీలను నిర్వహిస్తామని చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.మస్తాన్‌బాబు తెలిపారు. ఆయన బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలో వివరాలు వెల్లడించారు. ఈ పోటీలు కోవూరులోని శ్రీచైతన్య స్కూల్లో జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రాన్ని తీసుకురావాలని కోరారు. వివరాలకు 98481 47889 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రెండు లారీల స్వాధీనం

సోమశిల: సోమశిల సమీపంలోని పడమటికంభంపాడు రీచ్ నుంచి అధికలోడుతో ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను ఆత్మకూరు సీఐ ఎం.నాగేశ్వరరావు బుధవారం పట్టుకున్నారు. వాటిని అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు వాటిపై కేసు నమోదు చేసి ఒక లారీకి రూ.72,200, మరో లారీకి రూ.63,500 జరిమానా విధించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:101
లేయర్ (లైవ్)	:75
బ్రాయిలర్ చికెన్	:182
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:202
లేయర్ చికెన్	:128

రుణాలు, ఉద్యోగాల పేరుతో బురిడీ

- ప్రజాప్రతినిధులే టార్గెట్‌గా తెలుగు రాష్ట్రాల్లో మోసాలు
- 30 మంది నుంచి రూ.70 లక్షలు కాజేసిన వైనం
- నిందితుడైన మాజీ ఏఈ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ప్రజాప్రతినిధుల కారణంగానే ఉద్యోగం పోయిందన్న అక్కసు అతడిలో ద్వేషాన్ని నింపింది. ఎలాగైనా వారిని మోసగించి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. సాంకేతికత ఆధారంగా నేరాలకు పాల్పడుతూ రూ.లక్షలు కాజేశారు. నెల్లూరు నగరంలో ఓ ప్రముఖుడిని మోసగించిన ఘటనతో అతని వ్యవహారం బయటపడింది. బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం రాత్రి బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్లో ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ నిందితుడి వివరాలను వెల్లడించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి గ్రామానికి చెందిన తోట బాలాజీనాయుడు కాకినాడ జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజినీరింగ్ చదివాడు. 2000లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లా పాల్వంచలోని ఎన్‌టీపీఎస్ ప్లాంట్‌లో ఏఈగా విధుల్లో చేరాడు. 2007లో ఆయన రామగుండంలోని ఎన్‌టీపీఎస్ ఏఈగా పనిచేస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు అరెస్ట్ చేయడంతో ఉద్యోగం పోయింది. ప్రజాప్రతినిధులే కేసులో ఇరికించారని భావించిన బాలాజీ వారిపై అక్కసు పెంచుకున్నాడు. వారిని లక్ష్యంగా చేసుకుని సాంకేతికత ఆధారంగా మోసాలకు పాల్పడ సాగాడు.

జైలుకి పంపినా..

2009లో తొలిసారిగా విజయనగరంలో ఓ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధికి ఫోన్ చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్ష నగదు కాజేశాడు. ఆ తర్వాత కొందరికి రుణాలు, పథకాలు మంజూరయ్యాయని అందుకు ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాలని ఉమ్మడి రాష్ట్రంలోని సుమారు 30 మంది ప్రజాప్రతినిధులను మోసగించి రూ.60 నుంచి రూ.70 లక్షలు కాజేశాడు. అప్పట్లో మోసపోయిన బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. వైజాగ్ జైలులో ఉన్న సమయంలో ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. చర్లపల్లి జైలులో ఉన్న సమయంలో థ్రోట్ కేన్సర్ బారిన పడ్డాడు. పాండిచ్చేరిలో చికిత్స చేయించుకుంటున్నాడు. గతేడాది తిరుపతికి చెందిన ఓ ప్రజాప్రతినిధిని మోసగించిన కేసులో బాలాజీని పోలీసులు మరోసారి అరెస్ట్ చేసి కడప జైలుకు పంపారు. బయటకు వచ్చిన అతను గుంటూరులో తనకు పరిచయం ఉన్న ఓ కానిస్టేబుల్ సెల్‌ఫోన్ తీసుకున్నాడు. దానిని ఉపయోగించి ఓ పథకం కింద నగదు మంజూరైందని ఆ మొత్తాన్ని విడుదల చేయాలంటే కొంత నగదు చెల్లించాలని వైఎస్సార్ జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కుటుంబసభ్యుల నుంచి రూ.4 లక్షలు కాజేశాడు. ఈ క్రమంలోనే ఆరోగ్యం క్షీణించడంతో పాండిచ్చేరిలోని హాస్పిటల్‌లో చేరాడు. అక్కడ ప్రకాష్ అనే కారు డ్రైవర్‌తో పరిచయమవగా అతడి బ్యాంకు ఖాతా నంబర్ తీసుకున్నాడు. తన బ్యాంకు ఖాతా పనిచేయడం లేదని, బంధువులు తన చికిత్సకు అవసరమైన నగదు నీ ఖాతాలో వేస్తారని చెప్పాడు. అతడి మాటలను డ్రైవర్ నమ్మాడు. గతనెల 20న నెల్లూరు నగరానికి చెందిన ఓ ప్రముఖ వ్యక్తికి ఫోన్ చేసి తన పేరు ప్రకాష్ అని, మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డిప్యూటీ డైరెక్టర్‌నని పరిచయం చేసుకున్నాడు. పీఎంఈజీపై కింద నెల్లూరు నగరంలోని కొందరికి రుణాలు మంజూరయ్యాయని అందుకు ప్రాసెసింగ్ ఫీజు, అప్లికేషన్ చార్జీలు, ఈఎండీ తదితరాల చెల్లించాలని నమ్మించాడు. సదరు వ్యక్తితోపాటు మరికొందరి వద్ద నుంచి రూ.2.66 లక్షలు కాజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు సైబర్ నేరం కింద కేసు నమోదు చేశారు. ఫోన్ నంబర్, బ్యాంకు అకౌంట్ ఆధారంగా నిందితుడిని బాలాజీనాయుడిగా గుర్తించి బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని చెంచల్‌గూడ జైలులో ఉన్నట్లు తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.82
సన్నవి	: రూ.70
పండ్లు	: రూ.40

8 లోపు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తాం

- కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పులను ఈనెల 8వ తేదీలోపు పంపిణీ చేస్తామని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు నుంచి ఎన్నికల అధికారి చక్రధర్‌బాబు, జేసీ కూర్మనాథ్, ఎస్పీ విజయారావుతోపాటు పలువురు జిల్లా అధికారులు కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. అనంతరం జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో 1,07,635 మంది పట్టభద్రుల ఓటర్లు, 8,165 మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారన్నారు. పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేసుకుంటున్నామన్నారు. ప్రిసైడింగ్ అధికారులు, ఏపీఓలకు ఈనెల 9న రెండో విడత, 6న సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఇస్తామన్నారు. పట్టభద్రుల కోసం 129, ఉపాధ్యాయుల కోసం 40 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 1,300 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎన్నికల విధుల కోసం నియమించామన్నారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ముగిశాక పోస్టల్ బ్యాలెట్లతోపాటు అన్ని రకాల నివేదికలను చిత్తూరులోని రిటర్నింగ్ అధికారికి అప్పగించాలన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, అడిషనల్ ఎస్పీ హిమవతి, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, ఎన్నికల నోడల్ అధికారులు బాపిరెడ్డి, ప్రేమ్‌కుమార్, చిరంజీవి, వెంకట్రావు, శ్రీనివాసులు, సురేష్‌కుమార్, చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.